రుణమాఫీపై సంబురాలు

నాగర్‌కర్నూల్ : ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/ తిమ్మాజిపేట/ ఉప్పునుంతల/ అచ్చంపేట రూరల్ /కల్వకుర్తి /వెల్దండ, జూలై 18 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల్లో గురువారం రైతులు సంబురాలు జరుపుకొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.లక్షలోపు రుణలను మాఫీ చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి పటాకులు కాల్చి సంబురాలు నిర్వహించి గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. తిమ్మాజిపేటలో ఎంపీ మల్లురవి మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు లక్ష రూపాయల రుణలను మాఫీ చేశామని, ఆగస్టులో రూ.2లక్షలు మాఫీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు సంబురాలు చేసుకున్నారు. రుణాలు మాఫీ కాని రైతులు అధికారులను సంప్రదించాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

మర్రిపల్లిలో గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ, జూలై 18: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని మర్రిపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. పంచాయతీ భవనాలు పనులు వెంటనే ప్రారంభించి, నాణ్యతంగా చేపట్టాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో రైతులకు రుణమాఫీ అమలు చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ ప్రమీల, సింగిల్ విండో చైర్మన్ గురువయ్యగౌడ్, మాజీ సర్పంచ్ విజేందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, మండలాధ్యక్షుడు బాల్‌రాంగౌడ్ పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రైతు రుణమాఫీ

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన రైతులు

లింగాల, జూలై 18 : అర్హులైన రైతులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ అందజేస్తుందని, రైతులు అధైర్యపడొద్దని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రూ.లక్ష లోపు రుణమాఫీ ప్రారంభం సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు తిలకించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయధికారి మాట్లాడుతూ మండలంలోని స్థానిక ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సంఘమేశ్వర గ్రామీణ బ్యాంకుల్లో రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులు 1,482మంది ఉన్నారన్నారు. రైతు రుణమాఫీ మూడు దశల్లో మాఫి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వం రైతు రుణామాఫీ చేయడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఫీల్డ్ అధికారి సాయికృష్ణ, ఏఈవోలు మానస, సురేంద్రారెడ్డి, చీన్యనాయక్, నాయకులు రాజు, లక్ష్మణ్‌నాయక్, వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

కూలి సక్రమంగా అందించాలి

వినతిపత్రాన్ని అందజేస్తున్న కూలీలు

కల్వకుర్తిరూరల్, జూలై 18 : ఉపాధి కూలీలకు సక్రమంగా వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఆర్డీవోపీడీ ఓబులేశ్‌కు కల్వకుర్తి ఎంపీడీవో కార్యాలయంలో కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు వినతిని అందించారు. గ్రామంలో చాలా మంది ఉపాధికూలీలు నిత్యం ఉపాధి పనుల్లో పని చేస్తున్న వారికి కూలీ వేతనాలు అందడంలేదని వారు వాపోయారు. గ్రామంలో ఒక్కో కుటుంబంలో నాలుగైదు జాబ్ కార్డులు ఉన్నాయని మరికొందరికీ జాబ్ కార్డులు లేవన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్‌గౌడ్, ఈజీఎస్ కూలీలు ఉన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి

- కేంద్రంలో మెరుగైన ప్రీ ప్రైమరీ విద్య
- లింగాల సూపర్‌వైజర్ విజయలక్ష్మి
- ఆయా గ్రామాల్లో కొనసాగిన 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమం

పెంట్లవెల్లి : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కల్వకుర్తి రూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు

లింగాల, జూలై 18 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అమ్మ జోలపాటతో పాటు ఆలన, పాలనా దొరుకుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని మగ్దూంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన భోజనంతో పాటు చిన్నారులకు ఆటపాటలతో చదువు నేర్పిండం జరగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శివ ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు బాలేశ్వరమ్మ, మహిళలు పాల్గొన్నారు.

చారకొండలో..

చారకొండ, జూలై 18: మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రశీదబేగం అన్నారు. గురువారం మండల కేంద్రంలో 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్, జూలై 18 : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు మెరుగైన ప్రీ ప్రైమరీ(పూర్వ ప్రాథమిక విద్య)విద్యను ఆటాపాటలతో అందిచబడుతుందని కల్వకుర్తి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం సమీపంలోని కల్వకుర్తి ఫస్ట్ అంగన్‌వాడీ సెంటర్ వద్ద 'అమ్మమాట- అంగన్‌వాడీ బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కాలనీలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ చిన్నారుల ఉజ్వళ భవిష్యత్‌కు పునాది వేయడమే లక్ష్యం గా పని చేస్తున్నారని వివరించారు. చిన్నారులకు ప్రీప్రైమరీ విద్య ద్వారా శారీరక మానసిక వికాసానికి దోహదపడే విధంగా నేర్పుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీచర్లు నిర్మల, అరుణ, మయూరి, నజీమున్నీసా పాల్గొన్నారు.

'అమ్మమాట-అంగన్‌వాడీ బాట'పై ర్యాలీ

పెంట్లవెల్లి, జూలై 18 : మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట'పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ మూడు సంవత్సరాలలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కేంద్రాల్లో నిర్వహించే ప్రీ ప్రైమరీ స్కూల్ కార్యాక్రమాలపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, షేఫీయా బేగం, నాగమణి, రాజేశ్వరీ, పద్మ ఉన్నారు.

అమ్రాబాద్‌లో..

అమ్రాబాద్, జూలై 18 : ఆడపిల్లలను రక్షించి చదివించి ఎదగనివ్వాలని ఐసీడీఎస్ సీడీపీవో దమయంతి అన్నారు. గురువారం అమ్రాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన సమావేశంలో ఫ్రీ స్కూల్ కరికులం గురించి, బేటీ బచావో బేటీ పడావో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో దమయంతి మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించి ఎదగనివ్వాలన్నారు. ఉన్నతంగా చదువులు చదివించి స్వేచ్ఛ స్వతంత్రాలు కలిగించాలని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండున్నర సంవత్సరాల పిల్లలకు ఎన్‌రోడ్‌మెంట్ చేసుకోవాలని అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ ఫ్రీ స్కూల్ కిట్లును అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణ్, ఎల్లయ్య, వెంకటమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడేరులో..

కోడేరు, జూలై 18 : మండలంలోని జనుంపల్లి గ్రామంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మీ, రామేశ్వరమ్మ, ఆశ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలి

- రైతుల ఖాతాల్లోకే రుణమాఫీ డబ్బులు విడుదల చేయాలి
- కలెక్టర్ బదావత్ సంతోష్

మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూలై 18 : తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరిచడానికి, వ్యవసాయ అభివృద్ధికి, రైతుల సంక్షేమాన్ని మెరుగు పరిచేందుకు, పంట రుణాల మాఫీని ఒక అత్యవసర పెట్టుబడిగా గుర్తించి రైతులపై ఉన్న ఆర్థికభారాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో రుణమాఫీ అందజేస్తుందని కలెక్టర్ బదావత్ సంతోష్ బ్యాంకర్లను అన్నారు. రుణమాఫీని జిల్లాలో అర్హులైన ప్రతి రైతు ఖాతాల్లో నేరుగా జమ చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ పథకం అమలుపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం బ్యాంకర్లు, వ్యవసాయాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2018 డిసెంబర్ 12వ తేదీన లేదా ఆ తర్వాత మంజూరైన లేక రెన్యువల్ అయిన రుణాలను, 09/12/2023 తేదీ నాటికి 2 లక్షల బకాయి ఉన్న పంట రుణాలకు ఆగస్టు 15వ తేదీలోగా రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అర్హులైన రైతులందరికీ రూ.లక్షలోపు రుణాలు 46,780 రైతులకు మాఫీ చేయనున్నట్లు వెల్లడించారు. రుణమాఫీ నేరుగా రైతుల ఖాతాల్లోకి విడుదల చేయాలని సూచించారు. ఎవరైనా రైతులకు రుణమాఫీ డబ్బులు విడుదల కాకుండా సమస్యలను రైతులు తెలుసుకునేందుకు మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో, జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఫిర్యాదు విభాగాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రుణమాఫీ కానీ రైతుల నుంచి వివరాలు తెలుసుకొని 30 రోజుల్లో పరిష్కరించి రుణమాఫీ అందేందుకు కృషి చేయాలని ఆదేశించారు. రుణమాఫీ డబ్బులు దుర్వినియోగం చేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆగస్టు 15వ తేదీ నాటికి రూ.2లక్షల రుణమాఫీ పూర్తవుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారాజు, జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు, బ్యాంక్ అధికారులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

'ఉపకార వేతనాలు విడుదల చేయాలి'

ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కల్వకుర్తి, జూలై 18 : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజ్ రీయింబర్‌మెంట్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్‌మెంట్స్ చెల్లించకపోవడం తో విద్యార్థులు ఫీజులు చెల్లించలేక, సర్టిఫికెట్లు తీసుకోలేక నరకయాతన పడుతున్నారని విద్యార్థి సంఘ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘ నాయకులు మహేశ్, సంతోష్, అర్జున్, మల్లేశ్, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల్లో పారదర్శకతకు అవకాశం ఇవ్వొద్దు

- నాగర్‌కర్నూల్ డీఆర్‌డీఎ పీడీ ఓబులేశ్

కల్వకుర్తి ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్డీవో పీడీ ఓబులేశ్

కల్వకుర్తి రూరల్, జూలై 18 : గ్రామాల్లో నిర్వహించే ఈజీఎస్ పనుల్లో ఎలాంటి అవకతవకలకు గాని పొరపాట్లకుగాని అవకాశం ఇవ్వొద్దని నాగర్‌కర్నూల్ డీఆర్‌డీఏ పీడీ ఓబులేశ్ అన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని సీఎల్‌ఆర్‌సీ కార్యాలయం వద్ద 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో జరిగిన ఈజీఎస్ పనులపై ఏర్పాటు చేసిన ఈజీఎస్ ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే పనులకు సంబంధించి ముందస్తు ప్రణాళికను గ్రామ సభ నిర్వహించి ప్రాధాన్యత ప్రకారం పనులను నిర్వహించాలన్నారు. ఈజీఎస్ సిబ్బంది కూలీలు చేసిన పనులను ఎప్పటికప్పుడు నమోదు చేసుకుని ఆన్‌లైన్ చేయాలని సూచించారు. పనులకు సంబంధించి నమోదు చేయడంలో సిబ్బంది జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ చంద్రశేఖర్, ఎంపీడీవోలు ఆంజనేయులు, వెంకట్రాములు, అంబుడ్స్‌మెన్ జంగయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్‌సిబ్బంది ఉన్నారు.

పుల్లగిరిలో మధ్యాహ్నం పస్తులే..

తిమ్మాజిపేట, జూలై 18 : తిమ్మాజిపేట మండలం పుల్లగిరి ప్రాథమిక పాఠశాలలో బడులు తెరిచిన నాటి నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడం లేదు. 5 తరగతులు ఉన్న ఈ పాఠశాలలో 22 మంది పైగా విద్యార్థులు ఉన్నారు. అయితే గత నెలలో పాఠశాల తెరిచిన నాటి నుంచి విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం లేకుండా పోయింది. స్థానికంగా వంట చేసేందుకు ఎవ్వరు ముందుకు రాకపోవడంతో భోజనం అందించలేక పోతున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. భోజనం లేకపోవడంతో విద్యార్థులు పాఠశాలకు రావడం లేదని, గురువారం పాఠశాలకు కేవలం ఒక్క విద్యార్థి మాత్రమే వచ్చినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎంఈవో శ్రీనివాసులు దృష్టికి తేగా, భోజనం పెట్టడం లేదన్న విషయం తనకు తెలిసిందని, గ్రామంలో ఎవ్వరు ముందుకురావడం లేదని పేర్కొన్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడానికి ఏర్పాట్లు చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఘనంగా ఆత్మీయ వీడ్కోలు

సత్యనారాయణను సన్మానిస్తున్న ఉద్యోగులు పాల ఉత్పత్తిదారులు

కల్వకుర్తిరూరల్, జూలై 18 : కల్వకుర్తి పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రంలో నాగర్‌కర్నూల్ జిల్లా పాల సహకార సంఘం డీడీగా విధులు నిర్వహించి బదిలీ పైన వెళ్తున్న సత్యనారాయణ యాదవ్‌ను విజయ పాల ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు, పాలశీతలీకరణ కేంద్రం ఉద్యోగులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనను పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. డీడీ సత్యనారాయణ కల్వకుర్తి నుండి జనగాంకు బదిలీకాగా ఆయన స్థానంలో డీడీగా ధన్‌రాజ్ బాధ్యతలు స్వీకరించనున్నారని పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ యాకన్న పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ పాల ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

కల్వకుర్తి, జూలై 18 : తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో అశ కార్యకర్తలు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. రుణమాఫీ ఉత్సవాలో భాగంగా కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే కశిరెడ్డి ఆశ కార్యకర్తలు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని ఎమ్మెల్యే కశిరెడ్డి ఆశ కార్యకర్తలకు హామీ ఇచ్చారు.

రుణమాఫీలో గందరగోళం

- అర్హత ఉన్నా మాఫీ కానీ రుణం

కొల్లాపూర్, జూలై 18 : రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రుణమాఫీపై రైతుల్లో ఆందోళన నెలకొన్నది. అర్హత ఉన్న రుణమాఫీ కాకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు అధికార పార్టీ నాయకుల ఇళ్ల చుట్టు తిరుగుతున్నారు. ముఖ్యంగా సొసైటీ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులకు రాజకీయ గ్రహణం పట్టింది. అర్హత ఉన్న తమ పార్టీ వారు కాదని లోన్ వివరాలను రుణమాఫీ కోసం పంపించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొల్లాపూర్ మండల సొసైటీ బ్యాంకు సీఈవో రాజకీయ నాయకుడి అవతారం ఎత్తడంతో చాలా మంది చిన్న సన్నకారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన లిస్టులో తమ పేరు లేకపోవడంతో బ్యాంకు అధికారుల చుట్టూ తిరగవాల్సిన రైతులు అధికార పార్టీ నాయకుల ఇండ్ల వద్దకు క్యూ కట్టారు. కుంటి సాకులు చెప్పుతూ రెండో దశ, మూడో దశ లో పేర్లు వస్తాయని మభ్యపెడుతున్నట్లు సమాచారం. రాజకీయాలకు అతీతంగా పంట రుణమాఫి చేయాలని రైతులు వాపోతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కోడేరు, జూలై 18 : మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన బయ్య పెద్ద కిష్టయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన బయ్య ఆంజనేయులు కుందేళ్ల నరసింహ, కురువ ఎల్లయ్య, కురువ బుజ్జయ్య, వెంకటస్వామి తమవంతు సాయంగా రూ.6వేల నగదును బాధిత కుటుంబానికి అందచేశారు. వారి వెంట గ్రామస్తులు ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కల్వకుర్తి రూరల్, జూలై 18 : కల్వకుర్తి పట్టణంలోని టీఎస్ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం సుభాషిని గురువారం ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి 1 గంటల వరకు నిర్వహించే డయల్ డీఎం కార్యక్రమంలో కల్వకుర్తి పట్టణం, మండలం నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ఉద్యోగులు, వ్యాపారస్తులు, ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు 9959226292 నెంబర్‌కు తెలియజేయాలని ఆమె కోరారు.

మహిళలకు అవగాహన

అచ్చంపేటరూరల్, జూలై 18 : అచ్చంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని హాజీపూర్‌లో గురువారం 'అమ్మమాట-బడిబాట' కార్యక్రమంలో భాగంగా తల్లులకు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించినట్లు సీడీపీవో దమయంతి తెలిపారు. కొత్త పాఠ్య ప్రణాళిక ప్రకారం ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో బోధన జరగాలని సూచించారు. అలాగే బేటీబచావో- బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేంద్ర, సునీత, డబ్ల్యూహెచ్ యూబీ వెంకటమ్మ, రేణుక, తల్లులు, కిశోరబాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

వెల్దండ ఎస్సైగా కురుమూర్తి బాధ్యతలు

వెల్దండ, జూలై 18 : వెల్దండ ఎస్సైగా కోడేరులో విధులు నిర్వహిస్తున్న ఎస్సై కురుమూర్తి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీపై వెల్దండకు వచ్చారు. ఈ సందర్భంగా గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఎస్సై కురుమూర్తిని స్థానిక సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి అభినందించారు. బాధ్యతలు చేపట్టిన ఎస్సై కురుమూర్తి సీఐకి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

తండాల్లో మెడికల్ క్యాంప్‌లు

కొల్లాపూర్, జూలై 18: మండలంలోని లక్ష్మీనాయక్ తండా, రామ్‌నాయక్ తండాల్లో గురువారం జిల్లా వైద్యాధికారి ఆదేశానుసారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ గ్రామంలోని తండావాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ముందులను పంపిణీ చేశారు. పెంట్లవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చంద్రశేఖర్ ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని తమ దృష్టికి తీసుకోని రావాలని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి రామ్మోహన్, వైద్య సిబ్బంది దివాకర్, ప్రభాకర్, ఉమాపతి రెడ్డి, శ్వేత, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

తిమ్మాజిపేట, జూలై 18 : మండల కేంద్రంలోని సీపీఎస్ పాఠశాలలో గురువారం మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ (ప్రీ స్కూల్) ప్రాథమిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన శిక్షణలో 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ఐదు అంశాల నేర్పించడంపై ఈ శిక్షణ ఇస్తున్నారు. ఇందులో చిన్నారుల శారీరక అభివృద్ధి, బాషాభివృద్ధి, మేధాభివృద్ధి, సామాజిక, నైతిక, భావోద్వేగ అభివృద్ధి, సాంస్కృతిక అభివృద్ధి పర్చడంపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నట్లు విజ్ఞాన్, కృష్ణవేణి తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బాలమణి, రేణుకాదేవి పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్

అచ్చంపేటటౌన్, జూలై 18 : విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర అఖిల భారత విద్యార్థి సమైక్య పిలుపు మేరకు సంక్షేమ హాస్టల్‌లను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు తక్షణమే సబ్బులు, బుక్స్, దుప్పట్లు, పెట్టెలు సకాలంలో అందించి నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సభ్యులు వరుణ్, కళ్యాణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలు ప్రదర్శించాలి

కల్వకుర్తి, జూలై 18 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సంబంధించిన పంట రుణాలను రూ.2లక్షలు మాఫీ చేస్తున్నామనే ప్రకటనను స్వాగతిస్తున్నామని కేఎల్ఐ రైతు జేఏసీ నాయకుడు రాంచంద్రారెడ్డి పేర్కొన్నారు. రూ.2లక్షల వరకు రుణాలు తీసుకున్న అర్హుల జాబితాను గ్రామాల వారీగా గ్రామ పంచాయతీల వద్ద ప్రదర్శించాలని, దీంతో అర్హత ఉండి రుణమాఫీ రాలేని రైతులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే వీలుంటుందని చెప్పారు. పంటలు సాగుచేసే ప్రతి ఒక్కరూ రైతేనని.. ఇందుకు కొత్త నిర్వచనాలను ప్రభుత్వం ఎందుకు ఇస్తుందో అర్థం కావడం లేదని బండెల ఆందోళన వ్యక్తం చేశారు.

ఆలయ నిర్మాణానికి సహకారం

కల్వకుర్తి, జూలై 18